క్లుప్తంగా

పల్లెల్లో జాజిరి సందడి



జాజిరి ఆడుగుతున్న మహిళలు

దహెగాం: హోళీ పండుగకు వారం రోజుల నుంచి పల్లెల్లో జాజిరి సందడి నెలకొంది. చిన్నా పెద్దా తేడా లేకుండా మండల కేంద్రంలోని దుకాణ సముదాయాల్లో, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి జాజిరి ఆడుతున్నారు. జాజిరి.. జాజిరి అంటూ.. పాటలు పాడుతూ.. డబ్బులు, ధాన్యం సేకరిస్తున్నారు. చిన్నారులు సేకరించి నగదుతో హోళీ రోజున రంగులు కొనుగోలు చేసి పండుగ జరుపుకుంటారు. ఎక్కడ చూసినా పల్లెల్లో జాజిరి సందడి నెలకొంది.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు చేయగా.. ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. బియ్యం నిల్వ ఉంచిన బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన జునుగరి సంజీవ్‌ను విచారించగా మహారాష్ట్రలోని అహేరికి తరలించి విక్రయిస్తున్నానని తెలిపాడు.

అంబేడ్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న అబ్దుల్ రహమాన్

వాంకిడి: గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్‌–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహిస్తున్న శ్రామనేర్ శిబిరాన్ని విలేకరులతో కలిసి సందర్శించారు. దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యల పరిష్కారానికి బుద్ధుడు, అంబేడ్కర్ చూపించిన మార్గాలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో బౌద్ధ గురువులు, శ్రామనేర్‌లు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



టోర్నీ ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో కౌటాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి ఆటల్లో రాణించాలన్నారు. క్రీడ స్ఫూర్తితో ఆటలు ఆడాలని, క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్, బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, ఎస్సై మధుకర్, నాయకులు వానుపటేల్, బాపు, తిరుపతి, రవీందర్ గౌడ్, బండు పటేల్, అజ్మత్ పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: మండలంలోని కరంజివాడ, శంకర్‌గూడ పాఠశాలలను ఎంఈవో ఆడే ప్రకాశ్ గురువారం సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ రిపోర్టులు, సీసీఈ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలన్నారు. వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేసేందుకు గ్రామస్తులతో మాట్లాడి స్థలం గుర్తించారు.

పాఠశాలలో వైద్య శిబిరం

నేరడిగొండ: మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో నేరడిగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 23 మంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా హెచ్ఈవో పవార్ రవీందర్ మాట్లాడుతూ వ్యాధులు దరి చేరకుండా ప్రతీ విద్యార్థి పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

రేషన్‌కార్డు కోసం ఎదురుచూపు

- నూతనంగా వచ్చిన దరఖాస్తులు 1063
- నిరీక్షిస్తున్న అర్హులు



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సీసీవో రాజు

కెరమెరి: అర్హులైన పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు అందించాలనే సంకల్పంతో నూతనంగా పెళ్లైన జంటలకు రేషన్ కార్డులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇటీవల అధికారులు నిర్వహించిన ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాని నెలకు పైగా గడుస్తున్నా.. నూతన రేషన్‌కార్డుల జారీలో ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయడం లేదు. గతంలో దేశమంతా ఒకే విధంగా ఆహార భద్రత కల్పించేందుకు ఆధార్‌తో రేషన్ కార్డులను అనుసంధానం చేసింది. ఎక్కడైనా ఆధార్ నెంబరు అనుసంధానమై ఉంటే మరోకార్డు కోసం దరఖాస్తు చేయలేం. చాలా మందికి తమ పుట్టింట్లో ఉన్న రేషన్ కార్డుల్లో పేర్లు ఉండి మెట్టినింటి నూతన కార్డుల కోసం దరఖాస్తులు చేసినప్పుడు అవి తిరస్కరణకు గురవుతున్నాయి. వీరంతా పాతరేషన్ కార్డులో తమ వివరాలను డెలీట్ చేయాల్సిన అవసరముంది.

నూతన దరఖాస్తులు 1063..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 157 గ్రామాలున్నాయి. రేషన్ షాపులు 18 ఉండగా బీపీఎల్ కార్డులు (ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం) 7782, అంత్యోదయ కార్డులు 987 ఉన్నాయి. వీరికి ప్రతీ నెల 189 క్వింటాళ్ల బియ్యం అందుతుంది. కాగా ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1063 మంది అర్హులు దరఖాస్తు చేస్తుకున్నారు.

రెండు చోట్ల పేర్లు ఉంటే..

పుట్టింట్లోనూ.. మెట్టింట్లోనే ఉన్న ఆధార్‌కార్డుల్లో పేరుంటే రేషన్‌కార్డు అందని పరిస్థితి. వివాహం జరిగిన మహిళలు తమ పుట్టింట్లో ఉన్న రేషన్ కార్డులో తమ పేరును తొలగించాల్సి ఉంటుంది. దీనికి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అత్తారింట్లో కొత్తరేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నామని, పేరు తొలగించాలని తెల్లని కాగితంపై వివరాలు రాయాలి. దరఖాస్తు వివాహ ధ్రువీకరణ పత్రం లేదా పెళ్లి పత్రికను జతచేయాలి. అనంతరం దరఖాస్తును పరిశీలించి పేరును తొలగిస్తారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం



మెట్టినింట్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి రేషన్ కార్డులు మంజూరు చేస్తాం. కొత్తగా పెళ్లి చేసుకున్న వాళ్లు పుట్టింట్లో ఉన్న రేషన్‌కార్డులో పేరును తొలగించుకోవాలి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పౌర సరఫరాల శాఖా అధికారులకు చేరవేశాం. ప్రభుత్వం నుంచి రేషన్ కార్డులు మంజూరు కాగానే లబ్ధిదారులకు అందిస్తాం.

– దత్తు ప్రసాద్, తహసీల్దార్, కెరమెరి

పారితోషికం అందించేదెప్పుడో?

- సమగ్ర ఇంటింటి సర్వే చేసిన సిబ్బంది
- ప్రతిఫలం అందక నిరుత్సాహం
- పెండింగ్‌లో రూ.13.65 లక్షలు



ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు (ఫైల్)

రెబ్బెన: రాష్ట్రంలో నివసిస్తున్న ప్రజల కుల, ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కులగణన సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వం ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనుకున్న సమయంలోగా పూర్తి చేసి చరిత్రలో నిలిచింది. అయితే క్షేత్రస్థాయిలో గడపగడపకు వెళ్లి కుటుంబాల స్థితిగతులు, ఆర్థిక, సామాజిక పరిస్థితుల వివరాలను సేకరించిన వారికి పారితోషికం అందించడం మర్చిపోయింది. ప్రభుత్వం మెడమీద కత్తిపెట్టినట్లుగా ఉరుకులు పరుగులతో సర్వే చేయించింది. ఉన్నతాధికారులు ఆదేశాలకు అనుగుణంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అందజేసినా నేటికీ ప్రతిఫలం అందకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. కుటుంబాల నుంచి సేకరించిన సమాచాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన డాటా ఎంట్రీ సిబ్బందికి సైతం ఎలాంటి పారితోషికం అందించలేదు.

11,942 కుటుంబాల వివరాలు సేకరణ..

ప్రభుత్వం గత నవంబర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించింది. రెబ్బెన మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 11,942 కుటుంబాలను అధికారులు గుర్తించి సర్వే ప్రక్రియ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలు సేకరించేందుకు 10 మంది సూపర్‌వైజర్లు, 97 మంది ఎన్యూమరేటర్లు విధులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు ఎన్యూమరేటర్లుగా పనిచేసి ఒక్క కుటుంబాన్ని వదలకుండా అన్ని వివరాలను సేకరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలలో విధులు నిర్వహించి మధ్యాహ్నం నుంచి సర్వే చేపట్టారు. ప్రభుత్వం కేవలం 10 రోజుల గడువు మాత్రమే విధించగా రాత్రి, పగలు అని తేడా లేకుండా పనిచేసి మండలంలో 100 శాతం సర్వే పూర్తి చేశారు.

రూ. 13.65 లక్షల పారితోషికం..

మండలంలో సమగ్ర ఇంటింటి సర్వే చేపట్టిన సిబ్బందికి పారితోషికంగా రూ. 13.65 లక్షల వరకు రావాల్సి ఉంది. సర్వేలో పాల్గొన్న 10 మంది సూపర్‌వైజర్లకు రూ.1.20లక్షలు రావాల్సి ఉండగా, 97 మంది ఎన్యూమరేటర్లకు రూ. 9.7లక్షలు అందించాల్సి ఉంది. అలాగే ప్రైవేటు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.1.8 లక్షల వరకు అందించాల్సి ఉండగా, పంచాయతీ కార్యదర్శులు, ఈపంచాయతీ ఆపరేటర్లకు రూ.95వేల పారితోషికం అందాలి. సర్వే ప్రక్రియ పూర్తయ్యి దాదాపు మూడున్నర నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఎదురుచూపులు..

ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిన సిబ్బందికి ప్రభుత్వం అందిస్తామన్నా పారితోషికం నేటికీ అందకపోవడంతో సిబ్బంది నిరుత్సాహానికి గురవుతున్నారు. సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్లకు రూ.12వేలు, ఎన్యూమరేటర్లకు రూ.10వేల చొప్పున అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నతాధికారులు సైతం ఇదే మాట చెప్పడంతో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు గ్రామాల్లో ఉత్సాహంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. సేకరించిన సమాచారాన్ని ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లు సైతం రాత్రి, పగలు అని తేడా లేకుండా పని చేశారు. సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక్కోఫాంకు ప్రైవేటు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.30, పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయతీ ఆపరేటర్లకు రూ.16 చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా అందించలేదు.

బ్యాంకు వివరాలు పంపించాం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసిన సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలను అడిగితే సేకరించి ఉన్నతాధికారులకు అందజేశాం. ఇప్పటి వరకు పారితోషికం విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి అందే డబ్బులు నేరుగా సూపర్‌వైజర్, ఎన్యూమరేటర్ల బ్యాంకు ఖాతాల్లోనే జమవుతాయి.

– శంకరమ్మ, ఎంపీడీవో

బీజేపీ నాయకుల సంబురాలు



దహెగాంలో టపాసులు కాల్చుతున్న బీజేపీ నాయకులు



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



స్వీట్లు పంచుతున్న నాయకులు

తిర్యాణి: కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీని గెలిపిస్తున్నాయని పార్టీ మండల అధ్యక్షుడు సారా రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం, పులి వెంకటేశ్, గేడం శుభాష్, గయంగి తిరుపతి, భాస్కర్, వల్క శ్రీధర్, గోపాల్, హన్మంత్, కుమార్, సంతోష్, మంగ రాజేశ్ పాల్గొన్నారు.

రెబ్బెన: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి బీజేపీ తన బలాన్ని, ప్రజాదరణను మరోసారి చాటుకుందని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజాదరణ బీజేపీ పార్టీకే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభారీ సుదర్శన్ గౌడ్, కృష్ణకుమారి, కిరణ్‌కుమార్, సునీల్ చౌదరి, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లగ్గామ దామోదర్, శంకర్, రాజన్న, వెంకన్న, లచ్చన్న మహేశ్, శ్రీకాంత్, వంశీ, దెబ్బడి సత్యం పాల్గొన్నారు.

లింగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమరయ్య గెలుపొందడంతో గురువారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకునర్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. మండలాధ్యక్షుడు ఆడే సురేశ్‌నాయక్ మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు హిరామన్, రవీందర్, సచిన్, అశోక్, సాగర్, దవీత్, రాజు, రాజేశ్, మనోజ్, ఉపేందర్ పాల్గొన్నారు.



కెరమెరి నుంచి గోయగాం గ్రామం వరకు వెళ్లే దారిలో మోదుగు పూలు కనువిందు చేస్తున్నాయి. ఎరుపు రంగులో విరబూసి ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. - కెరమెరి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీలోని కొలాం కొఠారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గురువారం ఎంపీడీవో అంజద్‌పాషా ప్రారంభించారు. పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కెరమెరి మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీని మొదటి విడతలో ఎన్నుకుందన్నారు. విడతల వారీగా బిల్లులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సతీశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పుష్పలత

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం 515 మంది విద్యార్థులకు 499 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇతరులు కళాశాల పరిసరాల్లోకి రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. మొత్తం 136 మంది విద్యార్థులకు 132 పరీక్షకు హాజరైనట్లు సీఎస్ బైరాగి, డీవో ప్రభాకర్ తెలిపారు.

దహెగాం: ఇంటర్ సెకండియర్ వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో సెకండియర్ విద్యార్థులు 130 మంది ఉండగా.. 124 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ గణపతి, డీవో సత్యనారాయణ తెలిపారు.

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ పుష్పలత పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. 345 మంది విద్యార్థులకు 325 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ బాలకిషన్ రావు తెలిపారు.

'బీజేపీకి ప్రజల మద్దతు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తో ప్రజలు విసిగిపోయి బీజేపీకి మద్దతు ఇ స్తున్నారని, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ సీట్లు సాధించడమే ఇందుకు నిదర్శనమ ని బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థి అంజిరెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించడంతో గురువారం జిల్లా కేంద్రంలో ని నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లోనూ విజ యం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స మావేశంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు ఖాండ్రె విశాల్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, మండల అధ్యక్షులు పెంటయ్య, ప్రసాద్‌గౌడ్, బాల్దార పు మధు, కాశయ్య, వెంకన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

23న 'నవజ్యోతి' గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఈనెల 23న నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు దండనాయకుల సురేశ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో అందజేసే కుమురం భీం నేషనల్ అవార్డులకు 2023 సంవత్సరానికి సినీ నటుడు సాయికుమార్, 2024 సంవత్సరానికి హీరో సుమన్‌లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని అర్లి(కె) గ్రామంలో శ్రీశబరిమాత ఆలయ 37వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ఆలయ పల్లకి ఊరేగింపు చేపట్టారు. సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సకినాపూర్, రుయ్యాడి, బరంపూర్, దేవాపూర్, ఆదిలాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్యనారాయణ, వినోద్, నారాయణ, సురేందర్ రెడ్డి, రాజు, సాగర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ



మాత్రలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు, సి విటమిన్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ తెలిపారు. ప్రతీ గురువారం ఐరన్ మాత్రలు, సి విటమిన్ మాత్రలు ప్రతీ విద్యార్థికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.